

# కడలూరు వెళ్లాలి ఒక నీలిమ కోసం

జాన్సన్ చోరగుడి

పైన ఆకాశం. కింద భూమి. ఈ రెండింటి మధ్య మనిషి. అతని చుట్టూ అక్కడక్కడా నీరు. ఎప్పటిది ఈ దృశ్యం. మనిషి మైదానాల మీద పచ్చికబయళ్ల మధ్య సంచరించిన కాలంనాటి మాట.

అదే ఆదిమకాలం నాటి సన్నివేశం, అదే అనుభవం మళ్లీ మళ్లీ తిరిగి మనిషి జీవితంలో పునరావృతం అవుతుందని అనుకోగలమా? అది కూడా ఇరవై ఒకటో శతాబ్దిలోకి ప్రవేశించాకా?!

కళ్ల ముందు నాకు ఆ క్షణాల్లో కన్పించింది ఏమిటి?

పైన ఆకాశం, కింద భూమి, చుట్టూ నీరు. మూడూ ప్రకృతిలో భాగాలే. మరి మనిషి తన మేధతో సృష్టించుకున్న భౌతిక ప్రపంచమంతా ఆ ఊపిరి ఆగిపోతున్న క్షణాల్లో ఏమైంది? ఏ మేరకు అది మనిషి అక్కరకొచ్చింది? తాను జీవిస్తున్నది ఈ భౌతిక ప్రపంచం కోసమే అని అంత ప్రగాఢంగా విశ్వసించే మనిషిని ఆ భౌతిక ప్రపంచం ఎందుకంత దగా చేసింది? బతకాలనే ఆశతో ముందుకు పరిగెడుతున్న మనిషి- వెనుక తరుముకు వస్తున్న నీరు. పరుగు- నీరు. పరుగు- నీరు ఎంత దూరమిలా?

ఊరు కొట్టుకుపోయింది. నా అన్నవాళ్లంతా కళ్ల ముందే కడలిలో కలిసిపోయారు. అయినా బతకాలి. నా ఊపిరి ఆగిపోకూడదు. నిన్నటి వరకు నువ్వు ఏమి చూసుకుని వేటి కొరకని బ్రతికావో అవి ఇప్పుడు లేవు కదా. ఇప్పుడు నీవు లేకపోతే వచ్చిన నష్టమేమిటి? లేదు నేను బతకాలి. ఎందుకు? ఆకాశానికీ భూమికీ మధ్య మళ్లీ ఒంటరిగా బ్రతకడానికా? కేవలం నువ్వు తప్ప ఇక్కడ నీకు మిగిలింది ఏముందని, మునుపెన్నడూ నువ్వు ఇలా బతికినవాడివి కాదుకదా! ఇప్పుడెలా బతగ్గలవ్? ఆగు, ఎటువైపుకి నీ నడక? మళ్లీ మైదానం లోకా! చీకటి పడింది. అవును విశ్రమించాలి. చెట్టు క్రిందో లేదా ప్రమాదమైతే చెట్టు మీదో ఎక్కడో ఒకచోట, ఎక్కడిదీ చెట్టు? విత్తనం పడి మొలిచినదా లేక ఎవరైనా పెంచినదా? ఏమో తెలియదు. కాని దాని పేరు మాత్రం చెట్టు. అది కూడా ఈ ప్రకృతిలో భాగమే.

చురుక్కుమన్న తొలిపొద్దు ఎండ నిద్ర లేపింది. సెంచరీ ఫోమ్ బెడ్ మీదే కాదు చెట్టు మీద కూడా నిద్రపడుతుందా? పడుతుందన్న తొలి అనుభవం! మళ్లీ నడక మైదానంలోకి... ఈ ఉదయం కాఫీ, పేపర్ ఏమీ గుర్తుకు రావడం లేదు ఏమిటి? మర్చిపోయానా లేక నాకు అవి అవసరం అన్పించడం లేదా? తడిసిన బట్టలు వంటి మీదే ఆరిపోయిన విషయం ఇప్పుడు గుర్తుకు రావడమేమిటి చిత్రం కాకపోతే! దూరంగా కనుచూపు మేరలో నా కుడి ఎడమల మరికొందరు నడుస్తున్నారు. కొన్ని గంటల నడక తర్వాత ఒక రోడ్డు మీదికి చేరాను. అది ఎక్కణ్ణించి ఎక్కడకు వెళ్తుందో తెలియదు. అయినా ఇప్పుడు నేనెక్కడకు వెళ్లాలి? మనుషులున్న మైదానం లోకి వెళ్లాలి. ముందుకు నడవాలి. మళ్లీ నడక.

నాలుగురోడ్ల కూడలి వద్ద గుమిగూడిన కొద్దిమందికి ఎవరో చిన్న డ్రమ్ముల్లో నుంచి ప్లాస్టిక్ మగ్గులతో నీళ్లు ఇస్తున్నారు. వరసలో నిలబడితే నాకూ ఇచ్చారు. ఆ పక్కనే మరొకరు రొట్టెలు ఇస్తున్నారు. తీసుకున్నాను. పెప్సోడెంట్ గుర్తుకు రాలేదు. పుక్కిలించి

రొట్టె తిని నీళ్లు తాగాను. కాలి క్రింద నల్లని తారురోడ్డు మీద అక్కడక్కడా పొడలు పొడలుగా మిగిలిన సముద్రపు ఇసుక మీద ఎండ మెరుస్తూ ఉంది. ఎందుకో తలెత్తి ఆకాశం వైపుకు చూస్తే- అది ఎప్పటి మాదిరిగానే ఉంది. క్రితం రోజు ఏమీ జరగలేదా? నీళ్లూ, రొట్టెలు ఇచ్చినవాళ్లు అన్నారు, మరో గంటకు ఆ కూడలికి ఒక ట్రక్కు వస్తుందని, దానిలో వారితోపాటు వస్తే సమీప పట్టణానికి చేరుకోవచ్చని. కొద్ది దూరంలో ఒక పెద్ద పొద మీద నుండి కిందికి వంగి ఇసుక మేటలో కూరుకుపోయిన పడవ. అది ఎక్కణ్ణించి ఇక్కడకు కొట్టుకొచ్చిందో, దగ్గరకు వెళ్లాను. దాని మీద గాడ్ ఈజ్ గ్రేట్ అని రాసి ఉంది. దానికి కొద్ది దూరంలో ఒక చిన్న మంటపం వంటిదాని మధ్య అర్ధనిమీలిత నేత్రాలతో నవ్వుతున్న బుద్ధుని విగ్రహం. ఆ కూడలి ఏ ఊరో, ఏ పట్టణమో తెలియదు. జనసంచారమైతే లేదు. కొద్దిసేపు ఒంటరిగా అక్కడ కూర్చున్నాను.

ఇంతలో సందడి. ట్రక్కు వచ్చింది కాబోలు. మాకు నీళ్లు పోసి, రొట్టెలు ఇచ్చినవాళ్లు అప్పటికే క్యాబిన్‌లో ఎక్కారు. మిగిలినవాళ్లు ఎక్కడానికి ఒకళ్ల నొకళ్లు తోసుకుంటున్నారు. ట్రక్కులో పాతిక వరకూ శవాలున్నాయి. వాటి మీద టార్పాలిన్ కప్పి వెనుకవైపు కూర్చోమన్నాడు ట్రక్కు డ్రైవర్. నవ్వుతున్న బుద్ధుని పెదాలను కుడిచేతి చూపుడువేలితో ఒకసారి స్పృశించి వడివడిగా నడుచుకుంటూ వచ్చి ట్రక్కు ఎక్కాను. ట్రక్కు కదిలింది. కడుపులో రొట్టె, నీళ్లు సర్దుకున్నాయి. ట్రక్కు కదలికలకు కళ్లు క్రమంగా మూతలుపడ్డాయి. ట్రక్కులో సగం జీవితం సగం మరణం.

అక్కడంతా గోలగోలగా ఉంది. సమయం మధ్యాహ్నం మూడు కావచ్చు. కొద్దిసేపటికి ట్రక్కు ఆగింది. ఎర్రటోపీ పెట్టుకున్న డ్రైవర్ వచ్చి వెనక షట్టర్ క్రిందికి దించి, 'బ్రతికి ఉన్నవాళ్లు ఆ కుడివైపు బంకు దగ్గరకు వెళ్లి పేర్లు రాయించుకోండి,' అని చెప్పి వెళ్లి ట్రక్కు స్టార్ట్ చేశాడు. అందరం వెంటనే దిగాం. ఒక ప్రాజెక్టు నిర్మాణానికి పునాదుల పని జరుగుతున్నదా అన్నట్టుగా అక్కడ కనుచూపు మేరలో ఓ డజను వరకూ ప్రొక్లెయిన్లు పని చేస్తున్నాయి. మేము ఎక్కి వచ్చిన ట్రక్కుల వంటివి అక్కడ చాలానే ఉన్నాయి. కొన్ని వస్తున్నాయి, వెళ్తున్నాయి. ఎవరో అన్నారు- ఇక్కడ పేర్లు రాయించుకున్న వారికి నంబర్ టోకెన్లు ఇస్తున్నారని, అక్కడ జరుగుతున్నదేమిటో అర్థమయింది. ప్రొక్లెయిన్ల తో పెద్ద పెద్ద గోతులు తీసి ట్రక్కుల్లో తెచ్చిన శవాలను ఆ గోతుల్లో వేసి మట్టి కప్పెడుతున్నారు.

నా అరచేతిని చూసుకున్నాను. వేళ్లను కదిపాను, కదులుతున్నాయి. ట్రక్కులోంచి దిగేటప్పుడు కప్పిన టార్పాలిన్ పక్కకు జరిగి కన్పించిన ఉబ్బిన అరచేతిని చూశాను. అది కదలడం లేదు. కాని నా అరచేయి కదులుతోంది. నేను బతికే ఉన్నాను. పైన ఆకాశం వైపు చూశాను. తల వంచి క్రింద నేలవైపు చూశాను. అన్నీ ఎప్పటి మాదిరిగానే ఉన్నాయి. ట్రక్కులో నా ప్రక్కన కూర్చున్న బట్టతల వాడు వచ్చి పేరు అన్నాడు. 'అమర్' చెప్పాను. వాడు నా టోకెన్ నెంబర్ తెచ్చి ఇచ్చాడు. ఈరోజు చీకటి పడేలోపు మనల్ని ఇక్కడికి దగ్గర్లోని సహాయ శిబిరానికి చేరుస్తారట అన్నాడు నాతో ఉన్న ఒకతను. అతని చేతులు చూశాను. అవి కూడా కదులు తున్నాయి. వాడూ బ్రతికే ఉన్నాడు. కాని వాడివి బండ వేళ్లు.

చేతులు కదులుతున్నాయి, కాళ్లు కదులు తున్నాయి. కళ్లు, చెవులు, ముక్కు, నోరు అన్నీ మామూలుగానే పనిచేస్తున్నాయి. కాని హృదయం ఎందుకు పనిచేయడం లేదు. అతి చిన్న విషయాలకు కూడా స్పందించిన ఈ హృదయం కదలికలు ఇప్పుడు ఎందుకు ఆగిపోయాయి. ఒక్కటొక్కటి జరిగిన ప్రతి క్షణం గుర్తు చేసుకుంటూ వెనక్కి వెళ్తే- ఆ రోజు ఉదయం వరండాలో వెలుగుతున్న క్రిస్మస్ స్టార్‌లో బల్బు స్విచ్ ఆఫ్ చేయడానికి స్విచ్ బోర్డు వద్దకు వెళ్లాను. 'డాడీ నేను ఆర్పుతాను,' అంటూ ఐదేళ్ల కూతురు నీలిమ మారాం చేస్తూ చేతులందించింది ఎత్తుకోమని. 'నీలూతోనట స్విచ్చాఫ్ చేయించండి,' అంటూ కిచెన్‌లో కాఫీ పెడ్తున్న వాసంతి కూడా వరండా లోకి వచ్చింది. ఇద్దరం నీలూను ఎత్తుకుని స్విచ్చాఫ్ చేయమన్నాం. నీలూ వేలు స్విచ్చాఫ్ చేయకముందే స్టార్ లైటారిపోయింది. దూరంగా ఎక్కడో హోరు. పెద్ద పెద్ద శబ్దాలు. పాపను తీసుకుని వాసంతి ఇంటిలోకి పరుగెత్తింది. బయట కుక్కలు అరుస్తున్నాయి. నేను పెద్దపెద్దగా అంగలు వేస్తూ లోపలికి వెళ్లి పాపను తీసుకుని వాసంతి చేతిని పట్టుకుని ఇంట్లో నుండి బయటకు తీసుకు వచ్చేశాను.

అప్పటికే ఆ కాలనీలో వాళ్లు రోడ్లమీద పరుగులు తీస్తున్నారు. వాళ్లతో పాటు మేము కూడా పరుగెడు తున్నాం. వెనుక నుండి అరుపులు, పెద్ద పెద్ద శబ్దాలు. చల్లనిగాలిలో నీటి తుంపర్లు, ఒక్కక్షణం బ్లాంక్ అయిన మెదడు. మా వెనక వస్తున్న నీరు మా ముందు ఎలా ఉంది? మమ్మల్ని దాటి మా మీద నుండి కెరటం మా

కంటే ముందుకు వెళ్లిందా? క్షణంలో ఎన్నో వంతో తెలియదు. వాసంతి నా కళ్లల్లోకి చూసింది. అప్పటికే ఆమె నన్ను అనుకునే క్రిందికి జారిపోతూ ఉంది. నడుం వద్ద కుడిచేత్తో బలంగా ఆమెను పట్టుకున్నాను. పాప వైపు చూశాను. కళ్లు గట్టిగా మూసుకుని రెండు చేతుల్తో నా మెడను వాటేసుకుంది. మా చుట్టూ నీళ్లు. నా కాళ్లు ఇప్పుడు భూమి మీద లేవు. అవి నెమ్మదిగా పైకి లేస్తున్నాయి. జారిపోతున్న పాప కోసం ఖాళీగా ఉన్న కుడిచేతిని కూడా ఆమె మీదవేసి పొదివి పట్టుకున్నాను. కుడిచేతిలోని వాసంతి ఇప్పుడు మాతో లేదు. మిగిలింది మేమిద్దరమే. నేలమీద నుండి పైకి లేచాక మేము కదులుతున్న తీరుకు ఒక పద్ధతి లేదు. వేగం పెరిగింది. అది ఉధృతమయింది. ఎంతసేపు అలా ప్రయాణిం చామో తెలియదు. నాతో నీలిమ లేదు. రెండు అర చేతులు చూసుకున్నాను. నిజంగా అవి ఖాళీగానే వున్నాయి. నేను కూర్చున్న రాతిబండ మీద కుడి ఎడమల చూశాను. ఖాళీ. నేనొక్కణ్ణే మిగిలాను. అప్ర యత్నంగా ఆకాశంవైపు చూశాను. నేలవైపు చూశాను. పాదాలకు అంటి ఉన్న సన్నటి సముద్రపు ఇసుక.

పెళ్లయిన రెండేళ్లకు వాసంతి కాన్పుకు వెళ్లే ముందు నన్ను చుట్టుకుని మౌనంగా రోదించింది. నేనూ ఏడ్చేశాను. చివరికి ఆమే నన్ను ఓదార్చింది. ఇప్పుడు నా పక్క నా వాసంతి లేదు. నీలిమ లేదు. నిజంగానే వాళ్లు లేరా? మరి నాకేమీ అన్పించడం లేదేమిటి? కూర్చున్న చోటే రెండు చేతులతో తడిమాను. బండరాయి చేతులకు తగిలింది. ఇదేమిటి ఎందు కిలా? పరిమితమైన దు:ఖాన్నే మనిషి వ్యక్తీకరించ గలడా? అది అంతకు మించినదైతే వ్యక్తీకరించడం ఎలా? ఇలా మౌనంతోనా? సాధ్యమేనా అది. మరి లోపల పెరుగుతున్న ఒత్తిడి? ఆ స్టీమ్ బయటకు పోయేదెలా? ఏ నిశిరాత్రిలోనో ఆకాశానికీ భూమికీ మధ్య ఒంటరిగా కొబ్బరాకుల మీద నుంచి కిందికి జారుతున్న మంచు బిందువుల సాక్షిగా ప్రియమైన నా వాసంతి కోసం, పాప నీలిమ కోసం బాహువుల్ని తెరచి ఎలుగెత్తి ఏడ్వాలి. గొంతు పూడుకు పోయేంతవరకూ పిచ్చివాడిలా ఏడ్వాలి. అప్పటిదాకా ఇంతే, ఈ మౌనమే.

అక్కడ పనిచేస్తున్న వాళ్లంతా ముక్కులకు గుడ్డలు కట్టుకుని ఉన్నారు. కొన్ని ప్రొక్లెయిన్లు తవ్విన మట్టిని పక్కన పోస్తుంటే, మరికొన్ని పక్కనున్న మట్టిని తవ్విన గోతుల్లో పోస్తున్నాయి. ఉండి ఉండి ఏదో ఒక ప్రక్క నుండి కీచుగా వినవస్తున్న రోదనలు ట్రక్కుల, ప్రొక్లెయిన్ల రణగొణధ్వనిలో బలహీనంగా విన్పిస్తు న్నాయి. నో, ఇలా కాదు నా శక్తికి మించి నేను ఏడ్వాలి. కూర్చున్నప్పటి నుంచీ కాళ్లు చీలమండల దగ్గర సలుపులు పెడుతున్నాయి. ముందురోజున తడి ఇసుకలో ఎంత దూరం నడిచానో తెలియదు. బట్టతల వాడు ఎక్కడ సంపాదించాడో తెలియదు, చొక్కా తొడుక్కున్నాడు. అది పొట్టిగా లావుగా ఉన్న వాడి మోకాళ్ల దగ్గరకు వచ్చింది. అక్కడ ఏర్పాటు చేసిన క్యాంప్ నుంచి కాబోలు చిన్న బొచ్చెలాంటి దానితో వేడిగా జావ తెచ్చాడు తాగమని. వాడి ముఖంలోకి చూశాను. ఏ భావం లేదు. దాన్ని అందుకుంటూ వాడి బండవేళ్లను మృదువుగా తాకాను. పక్కన కూర్చున్నాడు. తన గురించి చెప్పాడు. మొదటి నుంచీ తనది ఒంటరి జీవితమే అన్నాడు. నీళ్లలో కొట్టుకుపోతూ పక్కపక్కనే ఉన్న రెండు చెట్ల మధ్య ఇరుక్కుపోయి బతికాను అన్నాడు. ఇది లేకపోతే కొట్టుకుపోయే వాడివేమో అంటే గుమ్మటంలా ముందుకున్న పొట్టను తడుముకున్నాడు. వచ్చిన నవ్వుకు జావ తాగుతూ పొలమారాను. గిన్నె చేతి లోకి తీసుకుని తల మీద చరుస్తూ సంబాళించుకో మన్నాడు. ఆ నవ్వు ఏడుపు ఎప్పుడైందో తెలియదు. రెండు చేతులతో ముఖాన్ని కప్పుకున్నాను. బిగ్గరగా ఏడ్చాను. భుజం చుట్టూ చేతులు వేసి నన్ను పొదివి పట్టుకున్నాడు. ఎంతసేపు ఏడ్చానో తెలియదు. బట్టతల వాడు నన్ను అంటి పెట్టుకునే ఉండిపోయాడు.

మనిషి మస్తిష్కంలో ఒకేసారి ఎన్ని రసాయనిక చర్యలో కదా! పొగిలిపొగిలి దు:ఖం పొంగుకు వస్తున్న ఆ క్షణాల్లోనే బుద్ధి పనిచేసింది. ఒక్క ఉదుటున లేచి నిలబడి, 'మనల్ని ఇక్కడకు తీసుకు వచ్చిన ట్రక్కు డ్రైవర్ ఆ ఎర్రటోపీ వాడు ఎక్కడ?' అడిగాను. బట్టతల వాడికి నా ప్రశ్న అయోమయంగా తోచింది. వాడింకా నా ముఖంలోకి ప్రశ్నార్థకంగానే చూస్తున్నాడు. వాణ్ణి వెతికి పట్టుకో అంటూ ఒక్క ఉదుటున దూక్కుంటూ ఆ యంత్రాలూ, వాటి మధ్య యంత్రాల్లా పనిచేస్తున్న మనుషుల మధ్యకు పరుగులు తీశాను. ఎర్రటోపీ వాడు కావాలి, ఈ మూడురోజుల్లో ఈ భూమి మీద నాకు మళ్లీ మొలకెత్తిన మొదటి కోరిక. ఒకవేళ వాడు ఆ టోపీ తీసివేస్తే ఎలా గుర్తుపట్టడం. పేరు తెలియదు. ఆ మాటకొస్తే ఇక్కడున్న వాళ్లలో ఎవరి పేరు తెలుసు నాకు. నన్నెవరూ ఇంతవరకు నా పేరు అడిగినవాళ్లు లేరు. అందరూ మనుషులమే అదొక్కటే ఇక్కడ గుర్తింపుకు ప్రమాణం. కాకపోతే బతికినవాళ్లు చని పోయినవాళ్లు. అదొక్కటే తేడా.

పైన ఆకాశం కింద భూమి. వీటి మధ్య మనుషులు. ఒక్కసారిగా వీరి మధ్య ఇంతటి సార్వజనీనత ఎలా వచ్చింది? మనుషుల మధ్య నిరంతరం ఉండే సవాలక్ష అంతరాలు ఏమైపోయాయి ఇప్పుడు. ఎప్పుడో ఎక్కడో అరుదుగా ప్రకృతి సృష్టించిన విలయంతో ఒకానొక సన్నివేశంలో ఆవిష్కరింపబడ్డ ఈ దృశ్యం సత్యమా? లేక మనిషి కల్పించుకున్న భౌతిక ప్రపంచంలో నిరంతరం ఉండే అసంఖ్యాకమైన అంతరాలు సత్యమా? ఏది సత్యం, ఏది అసత్యం? మట్టిదిబ్బల మీద నుంచి దూక్కుంటూ పరుగెడుతున్నాను. అర్ధ వర్తులంగా కదులుతున్న ప్రొక్లెయిన్ మట్టి బక్కెట్ కింద నుంచి పరుగెడుతున్నప్పుడు ఎవరో నా జబ్బు పట్టుకుని, పక్కకు ఈడ్చేశారు. ముందుకు తూలిపడ్డాను. తడి మట్టి మీద మోకాళ్లు ఆన్చి తలెత్తి చూస్తే ముక్కుకు గుడ్డ కట్టుకున్న వాడొకడు బొగ్గు గనుల వద్ద పని వాళ్లు లోడుతో తోసుకెళ్లే రెండు చక్రాల తొట్టిబండి వంటిదాని మీద ఐదారుమంది పిల్లల్ని ఒకరి మీద ఒకరిని వేసి పక్కనున్న గోతి వద్దకు తోసుకుని వెళుతున్నాడు. నా ముఖానికి అతి సమీపంగా ఆ ట్రాలీ వెళ్లిపోయింది. ఆ పసిబుగ్గలు, చిన్ని చేతులు బూరెల్లా వుబ్బిపోయి ఉన్నాయి. వాళ్లందరి నోటి నుంచి బయటి కొచ్చి బుగ్గల మీద పెంకు కట్టిన తెల్లటి నురుగు చూసినప్పుడు, 'నా బుగ్గల నునుపుదనానికి జాన్సన్స్ బేబీ లోషన్ కావాలనే,' బుగ్గలు, చేతులు ఇవేనా? అనిపించింది. నన్నెవరో పొదివి పట్టుకుని తీసుకుని వెళ్లి కొంచెం దూరంగా నిలబెట్టారు- మా పనికి నువ్వు అడ్డమయ్యావు అన్నట్టుగా.

అవునూ ఇంతకీ ఎర్రటోపీ వాడు ఏడి? ఒక్క ఉదుటున పరుగెత్తబోయి అనుమానమొచ్చి భుజాల మీదుగా పక్కకు చూశాను. ఎర్రటోపీవాడు ఓ మట్టిగుట్ట మీద నిలబడి తలెత్తి ఆకాశంవైపు చూస్తూ నుంచొని పాన్‌పరాగ్ ప్యాకెట్‌ను కళ్లు సగం మూసి మరీ నోట్లో పోసుకుంటున్నాడు. చప్పున అతని దగ్గరకెళ్లి భుజం తట్టి నీ ట్రక్కు ఎక్కడ? అన్నాను. ముందు తన మూడ్‌ను నేను భంగపరచినందుకు తుళ్లిపడి నావైపు నిర్లక్ష్యంగా చూస్తూ, వెనక్కి తిరిగి ఐదారు ట్రక్కుల వైపు చెయ్యెత్తి చూపుడువేలుతో చూపించాడు. అవి అన్నీ ఒకేలా ఉన్నాయి. 'వాటిలో నీది ఏది?' మళ్లీ అడిగాను. 'ఆ అన్‌లోడ్ చేస్తున్నది,' అంటూ అక్కణ్ణించి వెళ్లిపోయాడు. క్షణం ఆలస్యం చేయకుండా అటువైపుకు పరుగెత్తాను.

క్లీనర్ కాబోలు ఓ పదహారేళ్ల కుర్రాడు ట్రక్కు దగ్గర ఉన్నాడు. 'ఈ ట్రక్కు ఏయే ప్రాంతాల నుంచి బాడీస్‌ను తెచ్చింది,' అడిగాను. వాడు జవాబు ఇస్తూ, '... అయినా ఆ ఏరియా నుంచి మాకిది ఏడో ట్రిప్పు సారూ,' అన్నాడు. 'తెచ్చిన బాడీలన్నీ ఏవీ?' అడిగాను. 'నిన్నటివరకూ తెచ్చిన వాటిని వాళ్లవాళ్ల కోసం ఐదారు గంటలుంచి తెలిస్తే పేరు, ఊరు, వయసు రాసుకుని మరీ పూడ్చుతున్నారు. కాని ఇవాల్టి నుంచి లోడ్లు ఎక్కువ కావడంతో ఆలస్యమవుతుందని తెచ్చినవి తెచ్చినట్టు కప్పెడుతున్నారు సారూ. శవాలు కూడా ఎక్కడికక్కడ పిగిలిపోతున్నాయి. లోడ్లు ఎత్తడం దించడం కూడా కష్టమవుతున్నది సారూ,' వాడు చెప్పుకుపోతున్నాడు.

నేను భయం భయంగా ట్రక్కు వెనక్కి వెళ్లాను. ఇంతలో బట్టతలవాడు వచ్చి నా భుజం మీద చెయ్యి వేశాడు. నేను వాడి చేతిని నా రెండు చేతుల్లోకి తీసుకుని పట్టుకున్నాను. ట్రక్కులోంచి చివరి శవం దించుతున్నారు. దించిన వాటిని దుప్పటి లాంటిదాన్లో వేసి ఇద్దరిద్దరు చెరి ఒక పక్కన పట్టుకుని నెమ్మదిగా గోతిలోకి జారవిడుస్తున్నారు. చివరిగా దించిన బాడీ ఆడమనిషిది. దాన్ని తీసుకుని తవ్వి గుట్టగా పోసిన మట్టి మీద వెనక్కి నడుచుకుంటూ వెళుతున్నవాడు వెనక ఎవరికో గుద్దుకుని చేతిలో ఉన్న రెండు దుప్పటి అంచుల్లో ఒకటి చెయ్యి జారి శవం మోకాలి నుంచి కింది భాగం కన్పించింది. అది తెల్లచీర. దాని మీద చిన్న చిన్న ఊదారంగు పువ్వులు. నా రెండు చేతుల్లో బట్టతల వాడి చెయ్యి నలిగిపోతూ ఉంది.

ఒక్కక్షణం వెనక్కి... ఆ చీర నీలిమ పాపతో క్రిస్‌మస్ స్టార్ స్విచాఫ్ చేయించినప్పుడు వాసంతి కట్టుకున్నదే, నీళ్లలో కొట్టుకుపోవడానికి ముందు నా కుడివైపున బలంగా నా చేతుల్లో పొదివి పట్టుకుని చివరి సారిగా వాసంతిని చూసినప్పుడు కట్టుకున్న చీర కూడా ఇదే? బిగ్గరగా అరిచాను, ఏమని అరిచానో తెలియదు. వాళ్ల పనికి అడ్డం పడుతూ పరుగెత్తాను. వాళ్లు ఆగారు. వాళ్ల చేతుల్లో ఉన్న శవాన్ని పూర్తిగా చూపించమన్నాను. వాళ్లిద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని దానిని అక్కడ వదిలారు.

బట్టతలవాడు నన్ను భుజాలు పట్టుకుని మరీ బాడీ దగ్గరకు నెమ్మదిగా తీసుకువెళ్లి ఆ శవం కాళ్ల వద్ద నన్ను నిలబెట్టాడు. చూడబోతున్నదాన్ని ఊహించుకుని కళ్లు మూసుకున్నాను. అతడు నన్ను నెమ్మదిగా

కుదిపాడు. క్షణంకాలం పాటు కళ్లు తెరిచాను- అది నా వాసంతే! పొట్టలోని అవయవాలన్నీ ఒక్కసారి గొంతు లోకి వచ్చినట్లయింది. పొత్తి కడుపును పట్టుకుని ఒక్క సారి వంచిన సువ్వలా ఆ మట్టిదిబ్బ మీద కూలి పోయాను. వంటిలోని బరువంతా తలలోకి వచ్చినట్ల యింది. కళ్లు, ముక్కు, నోరు మూడు ఏకకాలంలో ద్రవిస్తున్నాయి. నోటి వెంట సొంగలు ఆగకుండా కారు తున్నాయి. మరో ఇద్దరి సాయంతో బట్టతలవాడు నన్ను అక్కణ్ణించి ఇవతలకి తీసుకువచ్చాడు. చివరిగా వెనక్కి చూశాను. అప్పటికే వాసంతి ముఖం మీద ప్రొక్లెయిన్ మట్టి పోసింది.

ఆ గోతిలోకి చూశాను. అందులోని శవాలన్నీ తిరునాళ్లలో కంప్యూటర్ జాతకం చెప్పే మరబొమ్మల మాదిరిగా చేతులను ముందుకు సాచి ఉన్నాయి. అవి ఖాళీ చేతులు. ఆ రెండుచేతుల మధ్య దూరం ఓ నాలుగు అడుగులు ఉంటుందేమో... వాళ్లెవరికీ ఆరడుగులు కూడా అక్కర్లేకపోయింది!

నీలిమ ఎలా ఉందో, ఏమి తింటున్నదో? మా ఇద్దరి కోసం ఎంతగా ఏడుస్తున్నదో, అసలు ఉందా? చచ్చు ప్రశ్న. నా నీలిమ ఉంది. అంతే, కొన్నింటికి వివ రణలు ఉండవు. నాది బండ విశ్వాసమే కావచ్చు మరేదైనా కావచ్చు నా నీలిమ ఉంది. నేనామెను కలుసుకుంటాను.

చీకటిపడుతూ ఉంది. అక్కడ వేసిన ఖాకీ రంగు టెంట్ క్రింద ఉన్న ప్రభుత్వ అధికారులు తలమునకలు గా ఉన్నారు. అటెండర్ కాబోలు పెట్రోమాక్స్ లైట్ వెలిగిస్తున్నాడు. జనరేటర్ తెస్తున్న లారీ రోడ్డుకు గండి పడి ఎక్కడో ఆగిపోయిందని ఎవరితోనో చెబుతున్నాడు. టెంట్‌లోని టేబుల్ మీద ఉన్న వైర్‌లెస్ సెట్ ఆగాగి పని చేస్తూ ఉంది. నన్ను ఆ టెంట్‌లో ఉన్న అధికారి దగ్గరకు తీసుకువెళ్తానని ఒత్తిడి చేసిన బట్టతలవాణ్ణి వద్దని వారించాను.

మమ్మల్ని ఎక్కించుకున్న మిలిటరీ ట్రక్కు కది లింది. ఒకేసారి మూడు ట్రక్కులు బయలుదేరాయి. నేనూ బట్టతలవాడూ డ్రైవర్ క్యాబిన్‌కు నడుములు ఆనించి జేరబడ్డాము. తన పేరు సుబ్రహ్మణ్యమని, 'సుబ్బు' అంటారని చెప్పాడు. ట్రక్కు ఎక్కే ముందు ఇచ్చిన జావ తాగిన జనమంతా క్రమంగా నిద్రలోకి జోగుతున్నారు. ట్రక్కు వెనుకున్న ఖాళీలో నుండి ఆకాశం అర్ధచంద్రాకారంగా కనిపిస్తూ ఉంది. పౌర్ణమి దాటి వారం కావడంతో ఆలస్యంగా వెన్నెల వెలుగు చీకటి మీద పరుచుకుంటూ ఉంది.

"మీ గురించి చెప్పండి సార్?" సుబ్బు అడిగాడు.

ఆ చీకట్లోనే అతని ముఖంలోకి చూసి మౌనంగా ఉండిపోయాను. ఈ సుబ్బుకు నా గురించి నేను ఏమి చెప్పాలి. ఎనిమిదేళ్లపాటు ఫ్లోరిడాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా పనిచేసి తిరిగి ఇండియా వచ్చిన విషయం చెప్పాలా? ప్రస్తుతం బెంగుళూరులో ఓ బి.పి.ఓ (బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్) కంపెనీకి వైస్ ప్రెసిడెంట్‌నని చెప్పాలా? నా బ్యాంక్ బ్యాలెన్స్ గురించి చెప్పాలా, లేక నా కెరియర్‌లో ఇప్పటివరకు నేను సాధించిన విజయాల గురించి చెప్పాలా? కలిసింది మొదలు ఇప్పటివరకు ఎంతో ఆత్మీయుడైన ఈ మిత్రుడికి ఇప్పుడు నాతో ఉన్న నా స్టేటస్ లగేజి గురించి చెబితే ఏమవుతుంది? నాకు అతడు దూరమైపోతాడు. అయినా మూడురోజుల క్రితం నా భార్యా కూతురుతో నేను ఇంటి నుంచి బయటకు వచ్చిన కొద్దిక్షణాల్లోనే ఆ లగేజి బెల్టులు ప్రకృతి కెరటాల తాకిడికి నా భుజాల నుంచి జారిపోయాయి. ఇప్పుడు భూమ్యాకాశాల మధ్య నేను జీవించి ఉన్న ఒక మనిషిని మాత్రమే. ఇంకేమీ కాదు. బయట వెన్నెల మరికొంచెం తెల్లబడింది. నేవీ వాళ్లది కాబోలు దూరంగా ఎక్కడో హెలీకాప్టర్ ఎర్రలైటు వెలిగి ఆరిపోతూ ఉంది. సుబ్బువైపు చూశాను. నిద్ర పోలేదు. నా మౌనానికి నొచ్చుకున్నాడేమో అన్పించింది. చెప్పాను. నా పేరు అమర్. అమ్మనాన్న లేరు. భార్య వాసంతి. మాది ప్రేమ వివాహం. వాసంతి లేదు... పాప నీలిమ ఎక్కడో ఉంది. ఆమెను కలవాలి.

మెలకువ వచ్చేసరికి ఏదో పట్టణంలో ఉన్నాము. "సుబ్బూ నీ సంగతేమిటి?" అడిగాను.

"నాదేముంది సార్, కొన్ని రోజులు కూలిపని చేస్తాను. కొద్దిగా డబ్బు దాచుకుని ఎక్కడో ఒకచోట టీ కొట్టు పెట్టుకుని మళ్లీ నా జీవితం ప్రారంభిస్తాను. నో ప్రాబ్లమ్ సార్, నో లాస్ నో గెయిన్.' తాను ముందు ట్రక్కు నుంచి దిగి నాకు చేయి అందిస్తూ ఇంగ్లీష్‌లో చెబుతున్నాడు. "నేనొక ఫోన్ చెయ్యాలి నీ దగ్గర ఒక రూపాయి నాణెముందా?" సుబ్బును అడిగాను. జేబు లో చెయ్యి పెట్టి తన వద్ద ఉన్న ఒక్క ఐదు రూపాయల నాణెం నాకు ఇచ్చాడు. ఆ జంక్షన్లో వీధిలైట్ క్రింద నా కళ్లల్లో నీళ్లు సుబ్బుకు కన్పించి ఉండకపోవచ్చు. నా వేలికున్న ఉంగరం తీసి సుబ్బు చేతిలో పెట్టి, "దీనితో నీ టీ స్టాల్ ప్రారంభించు," అన్నాను. నా రెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని వద్దని వారించాడు. అతని

భుజం తట్టి అక్కణ్ణించి నెమ్మదిగా దగ్గర్లోని టెలిఫోన్ బూత్‌వైపు అడుగులు వేశాను.

*

చదవడం ముగించి పత్రికను మూసిన కృష్ణ మోహన్ కళ్లు మూసుకుని ఒక్కసారి వెనక్కి వాలాడు. అతని కళ్లముందు నీలిమ రూపం కదలాడుతూ వుంది. అతను కూర్చున్నది ఆ నగరంలో అత్యంత ప్రతిష్టాత్మక మైన సి.టి. స్కానింగ్ సెంటర్‌లో. అరడజను వరుసల్లో వరసకు ఇరవైమంది చొప్పున ఆ హాల్లో కూర్చుని వున్నారు. ఇంచుమించు అందులో సగం మంది సీట్లు లేక నిలబడి ఉన్నారు. ఒక వరుసలో చివరగా కూర్చుని ఉన్న కృష్ణమోహన్ ఆ హాలంతా ఒక్కసారి కలయ జూశాడు. ప్రతివాళ్ల చేతుల్లో ఒక నీలంరంగు ఫైలు. అక్కడున్న వాళ్లంతా బ్రతికి ఉన్నవాళ్లే. కాని మరింత ఎక్కువకాలం బ్రతకాలనే ఆశతో అక్కడికి వచ్చిన వాళ్లు. కృష్ణమోహన్ ఆ హాలును ఆ జనంతో సహా తీసు కెళ్లి అమర్ భార్య వాసంతిని ఖననం చేసిన మైదానం మధ్య ఉంచి ఆ ప్రొక్లెయిన్లు - తవ్వకాలు, పూడ్చడాలు మధ్య పెట్టి చూడసాగాడు. అతనికి ఆ ఊహాచిత్రం చాలా నచ్చింది. ఎంతగా అంటే ఫక్కున పగలబడి నవ్వేంతగా నచ్చింది. మనసులోనే ఆ పనిని మనః స్ఫూర్తిగా పూర్తి చేశాడు.

ఇంతలో రిసెప్షన్‌లో ఉన్న బక్కమ్మాయి, "కృష్ణ మోహన్‌గారూ... కృష్ణమోహన్‌గారూ..." అంటూ పిలుస్తూ ఉంది. చేతిలోని నీలిరంగు ఫైలును కూర్చున్న ఆ సీట్లోనే వదిలేసి నిలబడి రెండు చేతులు పాంటు జేబులో పెట్టుకుని, రిసెప్షన్ కౌంటర్‌వైపు చూశాడు. అక్కడ గోడకు దిగ్గొట్టిన రంగుల టీవీలో గ్రూప్ డ్యాన్స్ చేస్తున్న హీరోయిన్ని ముఖం కంటే కూడా ఐదారు సెకన్లకు ఒకసారి వక్షం వద్ద, పొత్తికడుపు వద్ద తెర అంతా చూపిస్తున్నారు. కుర్చీల మధ్య నుండి నడుచు కుంటూ బయటకొస్తున్న కృష్ణమోహన్ చూపు మళ్లీ టీవీ మీద పడింది. టీవీలో చూపిస్తున్న హీరోయిన్ అంగాలు నీటిలో పడి ఉబ్బితే ఎలా ఉంటాయా అన్పించింది. క్రింద స్క్రోలింగ్ వేస్తున్నారు. కడలూరు ప్రాంతంలో సహాయ శిబిరాల్లో ఉన్న సునామీ బాధితుల పిల్లల పేర్లు వరుసగా వస్తున్నాయి. కృష్ణమోహన్ కళ్లు ఆగి పోయాయి. స్క్రోల్ కదులుతూ ఉంది. వరుసగా పేర్లు వస్తున్నాయి. చివరి పేరు నీలిమ (5). అతను తన ముందున్న కుర్చీని గట్టిగా అదిమి పట్టుకున్నాడు. రిసెప్షన్‌లో బక్కమ్మాయి అరుస్తూ ఉంది కృష్ణమోహన్ గారు లేరాండి అంటూ.

బయటకొచ్చి గేటు దగ్గర నిలబడ్డాడు కృష్ణ మోహన్. పెళ్లి అయి ఏడేండ్లు అయినా పిల్లలు పుట్ట నందుకు భార్య మాధవికి ఇప్పటికే సవాలక్ష పరీక్ష లయ్యాయి. ఆమెతో పాటు అతనికి కూడా. ఇప్పుడు ఇదేదో కొత్త పరీక్ష. స్వగతంలో అన్నాడో పైకే అనేశాడో తెలియదు, "కడలూరు క్యాంప్‌కు వెళ్లాలి ఒక నీలిమ కోసం," అంటూ వడివడిగా అతను పార్కింగ్‌లో ఉన్న కారు వద్దకు నడిచాడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 16 జనవరి 2005*

